
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

నంద్యాల
జిల్లా వార్తలు
5
ఆదివారం 22 డిసెంబరు 2024



నాన్నే నాకు మార్గదర్శి

- గొప్ప విజయాలు సాధించాలని నూరి పోసేవారు
- నంద్యాల కలెక్టర్ రాజకుమారి గణియ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వివరాలు 6లో

'మా నాన్న నన్ను గొప్ప స్థానంలో చూడాలని కోరుకునేవారు. సినిమాలో ఏదైనా ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సంఘటనలు కనిపిస్తే అదిగో నువ్వు కూడా అలాగా ఉండాలి అని చెప్పేవారు. అది నాలో బలంగా నాటుకుపోవటం వల్ల భవిష్యత్తులో నేనే స్థాయికి ఎదగాలి అనేది చిన్నతనంలోనే నాటుకుపోయింది. ఇక నాన్న స్వతహాగా రైతు కావటంతో రైతులు పడే కష్టాల గురించి తెలిసేవి. అధికారులు ప్రభుత్వ కోణంలో నుంచి కాకుండా, రైతు కోణంలో ఆలోచించినప్పుడే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని చెప్పేవాడు. నేను అధికారిగా బాధ్యతలు నిర్వర్తించే ప్రతి క్షణం ఆయన మాటలు దృష్టిలో పెట్టుకుని రైతులకు మేలు చేసే విధంగా నిర్ణయాలు తీసుకుంటూ ఉంటా. అలాగే సామాన్య ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సావధానంగా విని పరిష్కరిస్తుంటాను' అని నంద్యాల కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. తన బాల్యంతో పాటు, చదువు, ఉద్యోగ జీవితం గురించి, తన ఎదుగుదలలో తన తండ్రి, భర్త పాత్ర గురించి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..



ముగిసిన ప్రాజెక్టు కమిటీ చైర్మన్ల ఎన్నికలు..!

కేసీకి బన్నూరు, తెలుగుగంగకు సంజీవరెడ్డి, ఎస్సార్బీసీకి జిల్లెల ● నాయకుల అండదండలున్న వారికే పట్టం



తెలుగుగంగ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సంజీవకుమార్‌రెడ్డికి డిక్లరేషన్ అందిస్తున్న ఎస్ఈ సుబ్బారాయుడు

నంద్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల తుది ఘట్టం ముగిసింది. కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్సార్బీసీ ప్రాజెక్టులకు చైర్మన్, వైస్ చైర్మన్లను డీసీలు శనివారం ఎన్నుకున్నారు. కేసీ కెనాల్ చైర్మన్‌గా బన్నూరు రామలింగారెడ్డిని కూటమి నాయకత్వం ముందుగానే నిర్ణయించటంతో ఈ ఎన్నిక లాంఛనప్రాయమే అయింది. ఇక తెలుగుగంగ, ఎస్సార్బీసీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ల గురించి ముందుగానే అనుకున్నా, ఎన్నికలు జరపాలని భావించారు. ఎన్నికలు లాంఛనంగా నిర్వహించి తమ అనుయాయులకే పట్టం కట్టారు.

చైర్మన్లు, వైస్ చైర్మన్లు వీరే..

కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్సార్బీసీ పరిధిలో జిల్లాలో దాదాపు 5 లక్షల ఆయకట్టు ఉంది. కేసీ కెనాల్ కింద 1,62,854 ఎకరాలు, ఎస్సార్బీసీ కింద 1,53,034 ఎకరాలు, తెలుగుగంగ కింద 1,29,412 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటికి చైర్మన్లుగా ఎన్నిక కావటం అంటే ఆ ప్రాజెక్టుల కింద ఉండే సమస్యలను తీర్చే పెద్దరికాన్ని భుజాన వేసుకోవటమే! అందుకే ఈ ప్రాజెక్టుల చైర్మన్ పదవులు కాస్త ప్రతిష్టాత్మకంగానే సాగాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్నది కూటమి నేతలే కాబట్టి ఆయా ప్రాజెక్టులకు తమ వారిని చైర్మన్ గిరి కట్టబెట్టే విషయంలో భేదాభిప్రాయాలు లేకుండా చూసుకున్నారని తెలుస్తోంది. కేసీ కెనాల్ చైర్మన్ పదవి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అనుచరుడు బన్నూరు రామలింగారెడ్డికి దక్కగా, వైస్ చైర్మన్ పదవి కడప జిల్లా మైదుకూరుకు చెందిన గురవారెడ్డికి దక్కింది. ఇక తెలుగుగంగ చైర్మన్‌గా చెన్నారెడ్డి సంజీవకుమార్‌రెడ్డి ఎన్నిక కాగా, వైస్ చైర్మన్‌గా మనోహర్ చౌదరి ఎన్నికయ్యారు. ఇక ఎస్సార్బీసీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా జిల్లెల రాజశేఖరరెడ్డి, వైస్ చైర్మన్‌గా మల్కి హుసేన్ ఎన్నికయ్యారు.

ముందే ఒప్పందం కుదిరిందా..?

కేసీ కెనాల్ చైర్మన్‌గా బన్నూరు రామలింగారెడ్డి ఎన్నిక పూర్తి కాలానికా లేక సగం కాలానికా అనే అనుమానాలున్నాయి. వాస్తవానికి కేసీ కెనాల్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు కడప నాయకులు బాగా ప్రయత్నించినట్లు సమాచారం. కేసీ కెనాల్‌కు నంద్యాల జిల్లా పరిధిలో 8 డీసీలు, కడప జిల్లా పరిధిలో 6 డీసీలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలోని ఓ రెండు డీసీలను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ముందుగానే మేల్కొన్న జిల్లా నాయకులు ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకువెళ్లి రామలింగారెడ్డిని ఏకగ్రీవం చేయించుకున్నారు. అయితే కడప నాయకులు తమ జిల్లాకు ప్రాతినిధ్యం లేకపోతే సరైన న్యాయం జరగదనే భావనతో మొదటి రెండేళ్లకు నంద్యాల జిల్లాకు వెళ్లినా పర్వాలేదని, కానీ ఆ తర్వాత తమ జిల్లాకు ప్రాతినిధ్యం దక్కేలా చూడాలని అధిష్టానాన్ని కోరినట్లు సమాచారం. ఇక తెలుగుగంగ ప్రాజెక్టుకు 8 డీసీలు ఉన్నాయి. ఇందులో 5 ఆళ్లగడ్డ పరిధిలో ఉండగా, 3 శ్రీశైలం పరిధిలో ఉన్నాయి. దీంతో ఈ ప్రాజెక్టు చైర్మన్‌గా ఆళ్లగడ్డ నాయకులకు సన్నిహితుడైన చెన్నారెడ్డి సంజీవకుమార్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నిక కాగా, వైస్ చైర్మన్‌గా శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన మనోహర్ చౌదరి ఎన్నికయ్యారు. ఎస్సార్బీసీ ప్రాజెక్టుకు సంబంధించి చైర్మన్‌గా జిల్లెల రాజశేఖరరెడ్డి, వైస్ చైర్మన్‌గా మల్కి హుసేన్ ఎన్నికయ్యారు.

ఆశగా...: సాగునీటి సంఘాలు, ప్రాజెక్ట కమిటీ ఎన్నికలు పూర్తి అయిన తర్వాత ఆయకట్టుకు సకాలంలో సాగునీరందించే ప్రణాళికలపై ప్రభుత్వం ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. ఇకపై సాగునీటి రంగ ప్రక్షాళనపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి అడుగులు వేయనున్నారు. సాగునీటి సంఘాలు, ప్రాజెక్టు కమిటీలు కొలువుదీరటంతో సాగునీరు సక్రమంగా అందుతుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



ఎస్సార్బీసీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన జిల్లాల రాజశేఖరరెడ్డి



కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా డిక్లరేషన్ పత్రాన్ని అందుకుంటున్న రామలింగారెడ్డి



రిజర్వాయర్‌లో వదిలేసిన నాపరాళ్ల వేస్టేజీ



ఆక్రమణలో అవుకు రిజర్వాయర్

- జలాశయం పక్కనే నాపరాతి డిపోలు
- వేస్టేజీని రిజర్వాయర్‌లోకి తోస్తున్న వ్యాపారులు
- తగ్గుతున్న నీటి నిల్వ శాతం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

అవుకు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, కడప జిల్లాల్లో 42,509 ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీటిని అందించే అవుకు రిజర్వాయర్ ఆక్రమణకు గురవుతోంది. అయినా ఎస్సార్బీసీ అధికారులు రిజర్వాయర్ నిర్వహణను గాలికి వదిలేశారని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలేరు చెరువు, గొల్లలేరు, తిమ్మరాజు చెరువులను కలుపుతూ 2010 నాటికి 4.148 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం పూర్తయింది. రిజర్వాయర్ సమీపంలో నిర్మించిన ఏపీ టూరిజం భవనం నుంచి కొత్త చెర్లోపల్లె సమీపంలో నిర్మించిన గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) వరకు తాడిపత్రికి వెళ్లే ఎన్‌హెచ్ ప్రధాన రహదారి ఉంది. వాహనదారుల రక్షణ కోసం రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్ స్థాయి నుంచి 100 నుండి 150 మీటర్లు భూభాగాన్ని వదిలి ప్రధాన రహదారిని నిర్మించారు. అయితే రిజర్వాయర్ వెంట వదిలిన భూభాగం నాపరాతి రాళ్ల డిపోల వ్యాపారులకు వరంగా మారింది. దాదాపు 2 కి.మీ మేర వ్యాపారులు ఆక్రమించి నాపరాతి డిపోలను ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచి కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు జిల్లాలకు నాపరాతిని కూలీలతో వివిధ ఆకృతుల్లో కటింగ్ చేయించి వ్యాపారులు సరఫరా చేస్తుంటారు. రిజర్వాయర్ భూభాగాన్ని వ్యాపారులు ఆక్రమించుకోవటమే కాకుండా నాపరాతి కటింగ్ నుంచి వచ్చే వేస్టేజీని పక్కనే ఉన్న రిజర్వాయర్‌లోకి ఎక్స్‌కవేటర్లతో తోయించేస్తున్నారు. దీంతో రిజర్వాయర్‌లో భారీ స్థాయిలో పూడిక చేరి నీటి నిల్వ శాతం తగ్గిపోతోంది. రిజర్వాయర్ భూభాగంలో ఏర్పాటు చేసుకున్న నాపరాతి డిపోలను తొలగించే విధంగా ఎస్సార్బీసీ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నాపరాతి డిపోలను తొలగించాలి



రిజర్వాయర్ భూభాగంలో వ్యాపారులు నాపరాతి రాళ్ల డిపోలను ఏర్పాటు చేసుకోవటమే కాక రాళ్లనుంచి వచ్చే వేస్టేజీని రిజర్వాయర్‌లోకి తోచేస్తున్నారు. రిజర్వాయర్‌లో భారీగా పూడిక చేరి నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. ఎస్సార్బీసీ అధికారులు రిజర్వాయర్ నిర్వహణను గాలికి వదిలేశారు.

- పక్కీరగౌడు, రామాపురం

రిజర్వాయర్ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



రిజర్వాయర్ భూభాగం ఆక్రమణదారులపై ఎస్సార్బీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి. 2 కి.మీ మేర నాపరాతి రాళ్ల డిపోలను ఏర్పాటు చేసుకున్నారు. రిజర్వాయర్ పర్యవేక్షణపై ఎస్సార్బీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

- దూదేకుల సిద్ధయ్య, రామాపురం.

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా మధుసూదన్‌రెడ్డి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్‌గా వై.మధుసూదన్ రెడ్డి నియమితుల య్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17 మంది డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు. గత కొంతకాలంగా వెయిటింగ్‌లో ఉన్న మధుసూదన్‌రెడ్డిని కర్నూలు జిల్లా ఏపీఐఐసీ జెడ్ఎంగా నియమించారు. ఇదిలా ఉండగా ఇటీవల చిత్తూరు జిల్లా నుంచి కర్నూలుకు బదిలీపై వచ్చి జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి తాజా పోస్టింగ్‌పై ఇంకా స్పష్టత రాలేదు.

మత్స్య సంపద అభివృద్ధికి కృషి చేయాలి : కలెక్టర్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి మత్స్యశాఖ ఉప సంచాలకుడు రాఘవరెడ్డిని ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో ప్రధాన మంత్రి మత్స్య సంపద పథకంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద 2020-21 నుంచి 2024-25 వరకు జరిగిన ప్రగతి నివేదికలను కలెక్టర్ సమీక్షిస్తూ మత్స్యశాఖ వినియోగాన్ని జిల్లాలో విస్తృతంగా పెంచాలని కలెక్టర్ సూచించారు. ఈ పథకం కింద ఫిష్ సీడ్స్ స్టాకింగ్, టూవీలర్స్, త్రీ వీలర్స్, ఫోర్ వీలర్స్, మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్, వ్యాల్యూ యాడెడ్ ప్రాజెక్ట్స్, రూ.50 లక్షల యూనిట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకుంటూ ఆక్వా హబ్ ఏర్పాటుకు కూడా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

జలాధివాసం నుంచి బయల్పడిన సంగమేశ్వర గోపురం

కొత్తపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సాగు, తాగునీటి అవసరాల కోసం అధికారులు దిగువ ప్రాంతాలకు కృష్ణానది జలాలను విడుదల చేస్తుండటంతో సప్తనదీ జలాల్లో నిక్షిప్తమైన సంగమేశ్వర ఆలయ శిఖరం బయల్పడింది. ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ ఎగువ పుష్కర ఘాట్ నుంచి మరబోటు ద్వారా వెళ్లి ఆలయ శిఖరానికి పూజలు నిర్వహించారు. శనివారం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 885 అడుగులకు గాను 862.90 అడుగులు కాగా, రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలకు గాను, 114.9952 టీఎంసీలుగా నమోదైంది. దీంతో సంగమేశ్వర ఆలయ శిఖరం మెలమెల్లగా బయల్పడుతూ శనివారం సాయంత్రానికి పూర్తి దర్శనం ఇచ్చింది. నీటి విడుదల ఇలాగే కొనసాగితే జనవరి నెలలో ఆలయం పూర్తిగా బయల్పడి సంగమేశ్వరస్వామి భక్తులకు దర్శనం ఇచ్చే అవకాశం ఉంది.



సప్త నదుల నుంచి బయల్పడిన ఆలయ శిఖరానికి పూజలు చేస్తున్న పురోహితుడు

నాన్నే నాకు మార్గదర్శి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గొప్ప విజయాలు సాధించాలని నూరి పోసేవారు

నంద్యాల కలెక్టర్ రాజకుమారి గణియ



నంద్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం కొల్లివలస అనే మారుమూల గ్రామం మాది. ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దులో కొండ ప్రాంతంలో ఉన్న ఊరు అది. 35 గడపలు ఉన్న చిన్న గ్రామం. మా నాన్న మాధవరావు, అమ్మ దమయంతి. మాది వ్యవసాయ కుటుంబం. అన్న రాజేంద్రకుమార్, నేను సంతానం. కుటుంబంలో పిల్లలు మాత్రమే ఉంటారని, అందులో ఆడ, మగ అనే బేధం ఉండకూడదన్నది నాన్న వాదన. అందుకే అన్నయ్యను, నన్ను ఒకేలాగా పెంచారు. ఓ రకంగా చెప్పాలంటే నన్నే కాస్త గారాబంగా పెంచారు. కానీ చదువు విషయంలో ఎలాంటి అశ్రద్ధ చేయనిచ్చేవారు కాదు. ఉద్యోగం చేసే ఆలోచన ఉన్నా లేకపోయినా, ఆడపిల్ల ఉన్నతంగా చదువుకోవాలని చెప్పేవారు. సినిమాల్లో ఏదైనా ప్రభుత్వ ఉద్యోగికి సంబంధించిన సంఘటన వస్తే 'అదిగో.. అలా నువ్వు కూడా గొప్ప అధికారివి కావాలి' అని చెప్పేవారు. అలా నాలో చిన్నప్పటి నుంచి గొప్పగా చదువుకోవాలని, ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించాలనే ఆలోచనను నాటారు. నాన్న వెనుక ఉండి నడిపించబట్టే నేను ఈ రోజు ఓ జిల్లాకు ఉన్నతాధికారిగా నిలవగలిగాను.

ఆ సంఘటనే ఉన్నతాశయానికి పునాది..

చిన్నప్పటి నుంచి గొప్పగా చదువుకోవాలని, పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ సంపాదించాలని ఆలోచన ఉండేది. కానీ ఎలాంటి ఉద్యోగ జీవితంలో కుదురుకోవాలి, అందుకు ఏం చేయాలి అనే ఆలోచన ఉండేది కాదు. 10వ తరగతి 534 మార్కులతో రాష్ట్ర స్థాయి 12వ ర్యాంకు సాధించినందుకు ఆగస్టు 15 సందర్భంగా అప్పటి శ్రీకాకుళం కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నాను. ఆ రోజు వేడుకల్లో కలెక్టర్ పొందుతున్న గౌరవం, ఓ ఉన్నత స్థానంలో ఉండి నా లాంటి వారికి ప్రోత్సాహం అందించడం వంటివి చూసి నాలో స్ఫూర్తి కలిగింది. నేను కూడా కలెక్టర్ స్థాయి అధికారిగా ఎదగాలని ఆ రోజు నిశ్చయించుకున్నాను. 10వ తరగతి తర్వాత చాలా మంది ఆలోచనలు పక్కదారి పడుతుంటాయని చెబుతుంటారు. కానీ నా విషయంలో అలాంటివి ఏమీ జరగలేదు. భవిష్యత్తు గురించి స్పష్టమైన ప్రణాళికలు ఉండటంతో చదువుకు సంబంధించినవి కాకుండా మరో ఆలోచన వచ్చేది కాదు. అందువల్లే ఇంటర్‌మీడియట్, డిగ్రీ, పీజీలో డిస్టింక్షన్‌లో పాసయ్యాను. 'ఈ రోజు చేసే పని నీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది' అని పెద్దలు అందుకే చెప్పారు కాబోలు.

నాన్న ఒప్పందం ప్రకారమే పెళ్లి

మాది పెద్దలు కుదిర్చిన వివాహం. మా వారి పేరు శ్రీహరి. వృత్తిరీత్యా ఉపాధ్యాయు డు. నా పీజీ పూర్తి కాగానే నా పెళ్లి నిశ్చయించారు. 2003లో వివాహమైంది. మా అత్తగారిది చదువుకున్న కుటుంబమే కావటంతో భవిష్యత్తులో చదువుకునేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని భావించారు. అయినా ముందు చూపుతో.. 'నా బిడ్డ చదువుకుంటా, ఉద్యోగం చేస్తా అంటే అడ్డు చెప్పకూడదు' అంటూ పెళ్లికి ముందే మా అత్తగారి కుటుంబం నుంచి మా నాన్న మాట తీసుకున్నారు. మాకు ఒక కొడుకు శ్రీదీప్. పెళ్లి అయిన ఏడాదే గ్రూప్-1 నోటిఫికేషన్ రావటంతో పరీక్షలు రాశాను. ఇక ఆ తర్వాత పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విషయంలో మా వారు చాలా సాయపడ్డారు. తాను ఉపాధ్యాయుడు కావటంతో పరీక్షలకు సంబంధించిన విషయాలను గూర్చి చర్చించటం, నోట్సు తయారు చేయటం, ఎలా రాయాలి అనే విషయంలో చాలా బాగా తోడ్పాటును అందించారు. పెళ్లికి ముందు నాన్న ఎంతలా తోడ్పాటు అందించారో, పెళ్లి తర్వాత మా వారు కూడా అదే స్థాయిలో సహకారం అందించారు.

హెచ్‌సీయూలో పోస్ట్ గ్రాడ్యుయేషన్

చిన్నప్పటి నుంచి బాగా చదువులో ముందుండేదాన్ని. అన్నింటా ఫస్టు మార్కులు నాకే. 7వ తరగతి వరకు టెక్కలి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాను. ఆ తర్వాత 10వ తరగతి వరకు వమ్మరవల్లిలో చదువుకున్నాను. ఇంటర్‌మీడియట్ విజయనగరం జిల్లాలోని తాటిపూడిలో ఏపీఆర్ జూనియర్ కళాశాలలో బైపీసీ చదివాను. ఆ తర్వాత బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ సబ్జెక్టులతో విశాఖపట్టణంలోని భారతీయ విద్యా కేంద్రంలో డిగ్రీ యూనివర్సిటీ టాపర్‌గా నిలిచాను. ఒక్కో సబ్జెక్టు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఓ ప్రత్యేకత ఉంది. ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడానికి 12 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. అలాంటి యూనివర్సిటీలో ఆలిండియా స్థాయి ఎంట్రన్స్ పరీక్షలో 8వ ర్యాంకు సాధించి సీటు సంపాదించాను. యానిమల్ బయో టెక్నాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (ఎమ్మెస్సీ) పూర్తి చేశాను. ఆ తర్వాత గేట్‌లో 94.34 పర్సంటేజీతో సీఎస్ఆర్ ఫెలోషిప్ సాధించాను. ఇలా చదువుకు సంబంధించిన ప్రతి మజిలీలో ప్రతిభ గల విద్యార్థిగా నిరూపించుకున్నాను. ఇన్ని మార్కులు తెచ్చుకోవాలని నాపై ఎవరూ ఒత్తిడి పెట్టేవారు కాదు. అయినా ఏదైనా సబ్జెక్టులో ఒక్క మార్కు తక్కువ వచ్చినా ఏడ్చేదాన్ని. కానీ ప్రస్తుతం పిల్లలు చదువు పేరిట తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. పిల్లలకు సబ్జెక్టులపైన ఇష్టం ఏర్పడేలా విద్యాబోధన చేయగలిగితే వారిపైన ఒత్తిడి ఉండదు. అధికారిగా ఆయా ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసినప్పుడు ఉపాధ్యాయులకు అదే చెబుతుంటాను.



తల్లిదండ్రులు, సోదరుడితో కలెక్టర్ (ఫైల్)

సాహిత్యంపై ఆసక్తి ఎక్కువే..

చిన్నప్పటి నుంచి ప్రతిదీ చదివే అలవాటు ఉంది. అదే ఆసక్తి పుస్తకాల వైపు కూడా మళ్లింది. విధుల్లో తీరిక లేకుండా ఉండేంత పని ఉన్నా పుస్తకాలు చదివే అలవాటును వదులుకోలేదు. ఖాళీ దొరికితే చాలు పుస్తకం చదువుతాను. నీతిని బోధించే చిన్న చిన్న కథలను అసలు వదిలిపెట్టను. గురజాడ అప్పారావు శత జయంతి ఉత్సవాలు సందర్భంగా అదే పేరుతో వెలువడిన పుస్తకానికి, ఉత్తరాంధ్ర కవులు రాసిన 'సారస్వత నీరాజనం' పుస్తకానికి ముందుమాట కూడా రాశాను. పుస్తకాలు మనలోని మంచి చెడులను విశ్లేషించుకునేలా చేస్తాయి. చాలా వ్యసనాలు మనిషిని పతనం వైపునకు నడిపిస్తాయి, కానీ పుస్తకం చదవటం అనే వ్యసనం మాత్రం మనిషిని ఉన్నత మార్గాల వైపునకు తీసుకెళుతుంది.

నా వంతుగా పని చేయడమే..

'మన చదువు, హోదా మన చుట్టూ ఉన్న పరిస్థితులను మార్చగలగాలి' అనేది నా ఉద్దేశం. ఉద్యోగ జీవితం మొదలుపెట్టినప్పటి నుంచి అధికారిగానే కాకుండా సగటు మనిషిలా ఆలోచిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసేదాన్ని. కొన్ని విషయాలు ప్రభుత్వ అధికారిగా కాకుండా, సాధారణ వ్యక్తిలా ఆలోచించి సమస్యను పరిష్కరించేదాన్ని. అలా విజయనగరం జిల్లాలోని ఓ మారుమూల గ్రామాన్ని దత్తత తీసుకుని వంద శాతం మరుగుదొడ్లు నిర్మించి జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నాను. ఈ విషయంపై నరేంద్ర మోదీ తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు.

మొదటి ప్రయత్నంలోనే..

పెళ్లి అయినే ఏడాది అంటే 2003లో మొదటి సారి గ్రూప్ -1 పరీక్ష రాశాను. అప్పట్లో గ్రూప్- 1లో ఆప్షనల్ సబ్జెక్టులు ఉండేవి. నాది సైన్స్ గ్రూపు కాబట్టి బోటనీ, జువాలజీ సబ్జెక్టులను ఎంచుకుని పరీక్ష రాశాను. దీనికి సంబంధించిన ఫలితాలు వెంటనే రాలేదు. ఇదిలా ఉండగా 2007లో మళ్లీ గ్రూప్- 1 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్ష రాసిన కొన్నాళ్లకే 2003కి సంబంధించిన గ్రూప్- 1 ఫలితాలు విడుదలయ్యాయి. ఇందులో నేను గ్రూప్- 1 అధికారిగా ఎంపికయ్యాను. అలా మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించి విజయనగరం జిల్లాలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ట్రైనింగ్ పూర్తి చేసుకొని అదే జిల్లాలో మొదటి పోస్టింగ్ చేపట్టాను. ఇక 2007లో రాసిన గ్రూప్-1 పరీక్షకు సంబంధించిన ఫలితాలు 2009లో వచ్చాయి. రెండోసారి కూడా గ్రూప్-1 సాధించాను. ఆ తర్వాత విజయనగరం జిల్లాలో ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టాను. ఆ తర్వాత అదే జిల్లాలో జడ్పీ సీఈఓగా విధులు నిర్వర్తించాను. ఆ తర్వాత 2017లో తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ అయ్యాను. ఆ జిల్లాలో డ్వామా పీడీగా, కాకినాడ ఆర్డీవోగా, జాయింట్ కలెక్టర్ -2 గా, ఇలా 2021 వరకు ఆ జిల్లాలోనే వివిధ హోదాల్లో పని చేశాను.

గ్రూప్-1 అధికారి నుంచి కలెక్టర్ వరకు..

2009లో డి ప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఎనిమిదేళ్లు ముగిసిన తర్వాత 2016లో ఐఏఎస్ బ్యాచ్‌కు ఎంపికయ్యాను. ఆ తర్వాత ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి అకాడమీలో శిక్షణ పొందాను. 2021లో ఐఏఎస్‌గా పదోన్నతి పొందాను. ఐఏఎస్‌గా మొదటి పోస్టింగ్ గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాను. ఆ తర్వాత పదోన్నతిలో భాగంగా ఈ సంవత్సరం జూలై 7న నంద్యాల కలెక్టర్‌గా వచ్చాను. నన్ను కలెక్టర్‌గా చూడాలని కోరుకున్న మా నాన్న, నేను ఐఏఎస్‌గా పదోన్నతి పొందిన కొద్ది రోజులకే (2021లో) చనిపోయారు. ఇక అమ్మ 2012లో ఓ ప్రమాదంలో చనిపోయారు. నన్ను తీర్చిదిద్దిన నా తల్లిదండ్రులు నన్ను కలెక్టర్‌గా చూడలేదన్న బాధ మాత్రం మదిలో మెదులుతూనే ఉంటుంది.



భర్త, కుమారుడితో కలెక్టర్ రాజకుమారి గణియ

ఇప్పటికీ వారి ఆశీర్వాదం తీసుకుంటూ ఉంటా..

నాలో ప్రతిభ దాగి ఉందని గుర్తించింది బాలరాజు మాస్టరు, అన్నపూర్ణ టీచరు. వీరిద్దరు చిన్నప్పటి నుంచి నన్ను బాగా ప్రోత్సహించేవాళ్లు. 6వ తరగతి చదువుతున్నపుడు అన్నపూర్ణ టీచరు వల్లే వమ్మరవల్లి గురుకుల పాఠశాలలో సీటు సంపాదించాను. జిల్లాలోని మొదటి 30 మంది ప్రతిభ గలిగిన విద్యార్థులకు మాత్రమే గురుకుల పాఠశాలలో చేరేందుకు అవకాశం ఉంటుందని, బాగా చదువుతాను కాబట్టి నన్ను కూడా రాయమని సూచించారు. ఆమె ప్రోత్సాహంతో పరీక్ష రాసి వమ్మరవల్లి గురుకుల పాఠశాలలో సీటు సంపాదించి 10వ తరగతి వరకు అక్కడే చదివాను. తమ విద్యార్థి ఈ స్థాయికి ఎదిగిందని అందరికీ గర్వంగా చెప్పుకుంటారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఇప్పటికీ వారి ఆశీర్వాదం తీసుకుంటాను.

24 నుంచి క్రీడా పోటీలు



కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా ఈ నెల 24, 26 తేదీల్లో జూపాడుబంగ్లా మండలం బాస్కరాపురంలో అంతర్రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎబీఎం సంఘం పెద్దలు శనివారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.35వేలు, రూ.25వేలు, రూ.15వేలు నగదు బహుమతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9701030603, 9642403482, 7989841124 నెంబర్లను సంప్రదించాలన్నారు.

25న ఓపెన్ వాలీబాల్ టోర్నమెంటు : క్రిస్మస్ సందర్భంగా ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో ఈ నెల 25న ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు ఎంఎస్ఎఫ్ కమిటీ గ్రామ పెద్దలు తెలిపారు. విజేతలకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, వరుస బహుమతులు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రవేశ రుసుం రూ.400లు చెల్లించాలన్నారు. వివరాలకు 7330868976 నెంబర్లను సంప్రదించాలన్నారు.

24న కబడ్డీ పోటీలు: క్రిస్మస్ సందర్భంగా దామగట్ల గ్రామంలో ఈ నెల 24, 25 తేదీల్లో క్రిస్మస్ ఉమ్మడి జిల్లాల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సుశీలమ్మ తెలిపారు. విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.8వేలు, రూ.5వేలు నగదు బహుమతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

26న సైకిల్ రేస్: ఈ నెల 26న దామగట్లలో సైకిల్ రేస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు విజేతలకు రూ.1,500లు ప్రథమ, రూ.800లు ద్వితీయ బహుమతులు కల్పిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

కేడీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి పదవి కాలం

ఆరు నెలల పొడిగింపు

- జిల్లా సహకార సంఘాలు కూడా
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కర్నూలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కేడీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) నవ్యను ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. పర్సన్ ఇన్‌చార్జి పదవి కాలం ఈ నెల 26వ తేదీతో ముగుస్తుంది. దీంతో 27వ తేదీ నుంచి మరో ఆరు నెలల పదవి కాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వ్యవసాయం అండ్ సహకార శాఖకు చెందిన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలకు ప్రస్తుతం కొనసాగుతున్న అధికారిక పర్సన్స్ ఇన్‌చార్జి పదవీ కాలం మరో ఆరు నెలలు అంటే 27-12-2024 నుండి 26-06-2025 వరకు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం-1964 మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం



అతిథులతో సామూహిక గీతా పారాయణం చేసిన చిన్నారులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళానిలయం నిర్వాహకురాలు బి. నాగమల్లేశ్వరమ్మ శిష్య బృందం నిర్వహించిన సామూహిక గీతా పారాయణం కార్యక్రమానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. శనివారం నగరంలోని సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 155 మంది చిన్నారులు భగవద్గీతలోని 47 శ్లోకాలు సామూహికంగా పారాయణం చేసి ఒక రికార్డును నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి చిన్నారులకు శిక్షణ ఇచ్చిన బి. నాగమల్లేశ్వరమ్మకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు నిర్వాహకులు మెడల్‌తోపాటూ ధ్రువీకరణ పత్రం అందజేసి సత్కరించారు.



మెడల్, ధ్రువీకరణ పత్రంతో నాగమల్లేశ్వరమ్మ

రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలకు ఎంపిక



చైతన్య సాయిశ్రీ

పాణ్యం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల 9వ తరగతి బాలిక చైతన్య సాయిశ్రీ రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మేరీ సునీత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 'కంజూమర్స్ అఫైర్' అనే అంశంపై నంద్యాలలో శనివారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బాలిక ప్రతిభ చూపిందని తెలిపారు. ఈనెల 24 న విజయవాడలో రాష్ట్ర వినియోగదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వక్తృత్వ పోటీలలో బాలిక పాల్గొంటుందని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో పాఠశాలకు చెందిన జ్యోత్స్న ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. బాలికలను పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

తుంగభద్ర తీరం..

సాహిత్యం







ఒకే ఇతివృత్తం... రెండు పుస్తకాలు

కర్నూలు జిల్లా రచయితల వినూత్న ప్రయోగం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇతివృత్తం ఒకటే...కానీ రాసిన పుస్తకాలు మాత్రం రెండు. ఒకటి రేడియో నాటకంగా జాతీయ స్థాయిలో బహుమతులు సాధిస్తే, మరోటి పౌరాణిక పద్య నాటకంగా ఆదివారం ఆవిష్కరణకు సిద్ధమైంది. ఇది కర్నూలుకు చెందిన రచయిత వినూత్న ప్రయోగంగానూ కళ, సాహిత్య చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తోంది. కర్నూలుకు చెందిన ప్రముఖ నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ 'సామా' అనే రేడియో నాటకాన్ని రాశారు. ఇది 1995-96 సంవత్సరంలో ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో ధారావాహిక నాటకంగా ప్రసారమైంది. అంతేకాదు జాతీయ స్థాయిలోనూ బహుమతి పొంది, అన్ని భారతీయ భాషల్లోకి అనువాదమై దేశవ్యాప్తంగా రేడియోలో శ్రోతలను అలరించింది. అయితే ఇదే నాటకంలో పాత్రలు పెంచి, 'జగదేక సుందరి సామా' పేరుతో రెండున్నర గంటల రంగస్థల నాటకంగా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, విద్వాన్ పత్తి ఓబులయ్య రూపొందించారు. ప్రముఖ నాటక రచయిత, దివంగత పల్లేటి కులశేఖర్ సంభాషణలు సమకూర్చగా, నాటకంలో పద్యాలు పత్తి ఓబులయ్య రచించారు. ఒక రాజ్యంలో రాజనర్తకిగా ఖ్యాతి గాంచిన వేశ్య సామా. ఆమె ఒక బానిసను ప్రేమిస్తుంది. దానికి బదులుగా ఆమెకు ఉన్న హక్కు ప్రకారం రాజ్యంలోని బానిసలను విడిపించాలని షరతు పెడతాడు ఆ ప్రేమికుడు. బదులుగా ఆమె బానిసత్వానికి విముక్తి కల్పించడం, కానీ ఆ ప్రేమికుడు ఆమె ప్రేమకు తగను అంటూ విషం సేవించి మరణించడం, ఆమె వాస్తవ స్థితిలోకి వచ్చి బౌద్ధ సన్యాసిగా మారిపోవడం ప్రధాన ఇతివృత్తం. అటు రేడియో శ్రోతలను అలరించిన ఈ నాటకం, ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో రంగస్థల పుస్తకంగా ఆవిష్కరణ పొంది, నాటక ప్రదర్శనగా ఇటు ప్రేక్షకులను అకట్టుకోనుంది.

నగరంలో నేడు



- ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నగర శివారులోని మామిదాలపాడులో వెలసిన గోదా గోకుల క్షేత్రంలో ఆదివారం ఉదయం 11:30 గంటలకు ఏడు రోజుల పాటు అఖండ విష్ణు సహస్రనామ పారాయణం ప్రారంభం అవుతుంది.
- ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ఆదివారం కర్నూలుకు వస్తున్నారు.
- నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఉమ్మడి కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సదస్సు.
- సాయంత్రం 6:30 గంటలకు జగదేక సుందరి సామా పుస్తకావిష్కరణ. అనంతరం పూర్తి నాటక ప్రదర్శన ఉంటుంది.



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయండి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదును సంబంధిత వ్యక్తులకు ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్ నుంయి జేసీ విష్ణుచరణ్‌తో కలిసి జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఇప్పటివరకు వచ్చిన అర్జీలలో ఉత్తమంగా పరిష్కరించిన వాటి వివరా లను పంపాలని ఆర్డీవోలను ఆదేశించారు.ఆర్డీఓలు, అన్ని మండలాల తహసీల్దారులు, మండల స్పెషల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

క్రీస్తు బోధనలు అనుసరణీయం

• నంద్యాల డీసీసీ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్


క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న పార్టీ కార్యకర్తలు

నంద్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు బోధించిన మాటలు ప్రపంచంలోని మానవాళికి అనుసరణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూసాని శ్రీనివాసరెడ్డి అన్నారు. క్రీస్తు పుట్టుక క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాల కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రేమ, శాంతి, కరుణ క్రీస్తు బోధనల్లోని అంశాలు ప్రపంచమానవాళికి క్రీస్తు జీవితం ఓ సందేశం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందన్నారు. సర్వమత స్వేచ్ఛకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. క్రైస్తవుల హక్కులకోసం, వారిసంక్షేమం కోసం గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు జిలాన్‌బాషా పీసీసీ సభ్యులు పఠాన్‌హబీబ్ ఖాన్, బాలస్వామి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జాకీర్‌హుసేన్, జిల్లా ఉపాధ్యక్షుడు బోయ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బుయాదవ్, నంద్యాల జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సొమ్ము చోరీ

మహానంది, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహానందిలో శనివారం చోరీ జరిగింది. దైవదర్శనం కోసం తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట నియోజిక వర్గంలోని రుద్రవరానికి చెందిన అందె శ్రీనివాసులు, కిషన్‌గౌడ్‌తో పాటు మరో ఐదుగురు మహానందికి కారులో వచ్చారు. ముందుగా ఆలయ ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరులో పుణ్య స్నానం కోసం గట్టుపై తమ బ్యాగును ఉంచి వెళ్లారు. స్నానాలు చేసుకొనే తిరిగి వచ్చేసరికి అందె శ్రీనివాసులుకు చెందిన బ్యాగులోని రూ.15 వేల నగదుతో పాటు కారు తాళాలు, ఏటీఎం కార్డులు ఎత్తుకెళ్లారు. బాధితులు దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కోనేరు పరసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. బాధిత భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భక్తులను అడ్డుకున్న అటవీ అధికారులు

ఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం నల్లమల అటవీ ప్రాంతంలోని తిరుమలదేవుని కొండకు వెళ్లే భక్తులను శనివారం అటవీ అధికారులు అడ్డుకున్నారు. దీంతో వారు కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన భక్తులు తిరుమల దేవుడి కొండపై పుట్టు వెంట్రుకల కార్యక్రమానికి వెళ్లడానికి అటవీ అధికారులను ముందుగానే సంప్రదించి ఆరు ట్రాక్టర్లతో వెళ్లేందుకు రుసుము చెల్లించి అనుమతి పొందారు. అయితే ఆరు ట్రాక్టర్ల కంటే ఎక్కువ వాహనాలు ఉండటంతో అటవీ అధికారులు బైర్లూటి చెక్‌పోస్టు వద్ద అడ్డుకున్నారు. దీంతో భక్తులు కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. చివరకు షరతులతో అనుమతించడంతో సమస్య సద్దుమణిగింది.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కోడుమూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కోడుమూరులోని సుందరయ్య నగర్‌లో ఇటీవల జరిగిన బోయ మధుబాబు(25) హత్య కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ తబ్రేజ్ తెలిపారు. కోడుమూరు సర్కిల్ పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. సుందరయ్య నగర్‌లో ఒక పెళ్లి వేడుకల్లో భాగంగా ఈ నెల 14న రాత్రి పెళ్లి ఊరేగింపు జరిగింది. సుందరయ్య నగర్‌లో నివాసం ఉంటున్న సురేంద్ర అలియాస్ సూరి, జంబులయ్య అనే ఇద్దరు యువకులు మద్యం తాగి పెళ్లి ఊరేగింపులో ఉన్న మహిళలంతా డాన్సు చేయాలని, వాళ్ల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో అక్కడే ఉన్న బోయ మధుబాబు, దేవేంద్ర నాయుడు ఆ ఇద్దరిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఇది జీర్ణించుకోలేని సూరి.. మధుబాబును చంపుతామని జంబులయ్యను రెచ్చగొట్టాడు. దీంతో బంబులయ్య పక్కనే ఉన్న రాయి తీసుకొని మధుబాబు ఎడమ కనితిపై బలంగా కొట్టాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకొన్న మధుబాబును కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 17న మృతి చెందారు. మధుబాబు సోదరుడు దేవేంద్రనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు నిందితులు శనివారం వల్లెలాంబదేవి ఆలయం సమీపంలో ఉన్నట్లు తెలుసుకొని అరెస్టు చేశారు. నిందితులను డిమాండ్‌కు పంపిస్తున్నట్లు సీఐ చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఏపీ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ రాముడు, నాగన్న, కానిస్టేబుల్ రమేష్ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో రైతు మృతి


బనగానపల్లె, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం గ్రామానికి చెందిన కమలపురి శివసుబ్బరాయుడు (42) అనే రైతు ధాన్యం ఆరబోసుకుంటుండగా గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. గ్రామంలో పలువురు రైతులు శివసుబ్బరాయుడు మృతదేహానికి నివాళులర్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు పీవీ.కుమార్‌రెడ్డి, వెంగన్న రైతుకు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడిగా భార్య కృష్ణవేణి, కుమార్తెలు సురేఖ, సుధీర్, సుభాషిణి ఉన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ఉయ్యాలవాడ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరివరం గ్రామానికి చెందిన పాలాజి కాంతమ్మపై అదే గ్రామానికి చెందిన దండు ఆబేలు గొడ్డలితో దాడి చేసి గాయపరచినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. కొళాయి నీటి విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇందులో కాంతమ్మను ఆబేలు గొడ్డలితో కొట్టి గాయపరచాడన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కొండచిలువ హల్‌చల్

చాగలమర్రి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేముల గ్రామంలో కొండచిలువ శనివారం రాత్రి హల్‌చల్ చేసింది. సుమారు 6 అడుగుల పొడవుగల కొండచిలువ పొలాల్లో నుంచి గ్రామంలోకి రావడంతో ఎస్సీ కాలనీ ప్రజలు భయాందోళన చెందారు. కొండ చిలువను హతమార్చడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.


ఎస్సీ కాలనీలో కొండచిలువ


జీవితమంతా గణితమే

- మనసుపెట్టి నేర్చుకుంటే చాలా సులువు
- నేడు భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి

ఆత్మకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) మనం ఎప్పుడు పుట్టాం? ఈ పుట్టుక తేదీ నుంచి జీవితంలో గణితం ఆరంభమవుతుంది. ఆ తర్వాత జీవనయానం అంతా లెక్కలతోనే ముడిపడి వుంటుంది. పండితులు, పామరులు ఎవరైనా సరే ఏదో సందర్భంలో లెక్కలతో కుస్తీపట్టక తప్పదు. జీవితంలో ఇంత భాగమైపోయిన గణితమంటే చాలా మందికి భయం. వామ్మో.. లెక్కలా..? నా వల్ల కాదు బాబోయ్.. అనేవారే అధికం. కానీ కష్టపడి, ఇష్టంతో చేస్తే గణితాన్ని మించిన సులువైన శాస్త్రం మరొకటి లేదన్నది నిపుణుల అభిప్రాయం. జీరో నుంచి ప్రారంభించి హీరోగా ప్రపంచఖ్యాతి పొందిన శ్రీనివాస రామానుజన్ లెక్కలకు చుక్కాని వంటివారు. ఎన్నో లెక్కల తికమకలకు చక్కని పరిష్కారం చూపిన రామానుజన్ భారతీయ గణిత మేధావుల్లో అగ్రగణ్యుడు. ఈయన జయంతి డిసెంబరు 22న ప్రతి ఏటా గణిత దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ.

గణితం సర్వంతర్యామి. ప్రతి అంశంలోనూ గణితానికి భాగస్వామ్యం వుంది. అందుకే విద్యార్థి దశలో గణితానికి అంత ప్రాధాన్యత ఇస్తారు. వాస్తవానికి అన్ని శాస్త్రాల్లోనూ గణితం మిళితమై వుంటుంది. ఉదాహరణకు సాంఘికశాస్త్రంలో అక్షాంశాలు, రేఖాంశాలు, దేశాల విస్తీర్ణాలు, మ్యాప్‌ల నిర్మాణంలో వున్న నిష్పత్తులు మొదలైనవన్నీ గణితమే. సైన్స్‌లో భారం, ద్రవ్యరాశి, మూలకాల ఆవర్తనం, సమీకరణాలు, జీవక్రియలన్నీ గణిత ప్రస్థావనతోనే సాధ్యం. భాషా వ్యాకణాలలోనూ గణితం వుంటుంది. ప్రస్తుతం అన్ని పోటీ పరీక్షల్లో గణితం తప్పనిసరి అయింది.





మాయా చదరాల మేధావి రామానుజన్

తన పుట్టిన రోజు 22.12.1887తో మాయా చదరాన్ని సృష్టించిన మేధావి శ్రీనివాసరామానుజన్. 16 గడుల చదరంలో ఏ నిలువు వరుస కూడినా, అడ్డువరుస కూడిన మొత్తం 139 వస్తోంది. కర్ణాలు, మూలాలు, మధ్య చదరం, మూల సంఖ్య మొత్తం, మూల చదరాల మొత్తం అన్నీ 139 సంఖ్యనే చూపిస్తాయి. ఇటువంటి మాయా చదరాలు ఎన్నో సృష్టించిన వ్యక్తి రామానుజన్. తన పదో ఏటనే ఉపాధ్యాయుడిని సున్నాతో సున్నాను గుణిస్తే 1 వస్తుందా అని అడిగిన ప్రతిభాశాలి. హైస్కూల్ రోజుల్లో 40 మంది ఉపాధ్యాయులకు టైమ్ టేబుల్ రూపొందించి గుర్తింపు సాధించారు. అధ్యాపకులు సాధించలేని సమస్యలను తాను క్లుప్తంగా సాధించేవారు. మ్యాజిక్‌స్క్వయర్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్ ప్రధాన సంఖ్యలపై పరిశోధనలు చేశారు. ఆంధ్ర యూనివర్సిటీలోని ఆయన చేతిరాత ప్రతుల ద్వారా ఇది తెలుస్తోంది. ఓ జర్నల్‌లో వచ్చిన సమస్యను సాధించి ఫలితాన్ని కేంబ్రిడ్జి యూనివర్సిటీ ఆచార్యులు జీహెచ్ హర్డికి పంపించడంతో రామానుజన్ ప్రతిభ ప్రపంచానికి తెలిసింది. త్రికోణమితికి సంబంధించిన సూత్రాలు సాధించడం, మాక్ థీటా ఫంక్షన్స్‌పై పరిశోధనలు నేడు అనేక రంగాల్లో ఉపయోగపడుతున్నాయి. 1729ని రామానుజన్ నంబర్‌గా పిలుస్తారు. ఆ నంబర్‌కు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఆ సంఖ్యను 10, 9ల ఘనాల మొత్తంగా 12, 1 ఘనాల మొత్తంగా మూడు ప్రధాన సంఖ్యల లబ్ధంగా 19, 91ల లబ్ధంగా చూపాడు. ఓ కారు నంబర్‌గా ఉన్న ఈ నంబర్‌ను చూసి ఈ విషయాలన్ని కనుగొన్నారు రామానుజన్.

ఇష్టపడి చదివితే గణితం లాంటి సబ్జెక్ మరొకటి లేదు



ఇష్టపడి చదివితే గణితం లాంటి సులువైన సబ్జెక్ట్ మరొకటి లేదు. చాలా మంది లెక్కల సబ్జెక్ట్ అంటేనే భయపడతారు. అలాంటి వారు గణితం మక్కువ చూపితే ఏ సమస్యనైనా సులభంగా సాధించవచ్చు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు గణితంలోని మెలకువలను తెలుసుకుంటే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

- డాక్టర్ ఎస్వీఆర్. శేఖరరెడ్డి, గణిత అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు.

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు...

• సీడీఎంఏ కన్నబాబు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర పాలక, మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లపై నిర్లక్ష్యం వహించరాదని కమిషనర్ ఆఫ్ డైరెక్టరేట్ అండ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) కన్నబాబు తెలిపారు. శనివారం రాత్రి నగర పాలక కార్యాలయంలో నగర పాలక సంస్థ, డోన్ మున్సిపాలిటీ, నందికొట్కూరు మున్సిపాలిటీకి సంబంధించిన కమిషనర్లతో రెవెన్యూ సెక్షన్, టౌన్ ప్లానింగ్, తాగునీటి పన్ను వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, అడిషినల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ పాల్గొన్నారు. ఈ మేరకు నగర పాలక మున్సిపాలిటీలో జరిగే వివిధ అభివృద్ధి పనులపై డైరెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్ను వసూళ్ల, తాగునీటి సరఫరా, పారిశుధ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా నగర పాలకను మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని డైరెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంబంధించి సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా.కే.విశ్వేశ్వరరెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న సీడీఎంఏ కన్నబాబు

కన్నబాబును సన్మానించిన టీఎన్‌టీయుసీ నాయకులు : తెలుగు నాయుడు యూనియన్ ట్రేడ్ నాయకులు సీడీఎంఏ కన్నబాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమణ, ఎంవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు డీఎంహెచ్‌వోగా డాక్టర్ శాంతికళ

• **స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ సీఎస్‌ఆర్‌ఎంవోగా బి.హేమనళిని**

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వైద్యఆరోగ్య శాఖలో 9 నెలల ఇన్‌చార్జి పాలనకు తెరపడింది. కడప జిల్లా జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న డాక్టర్ పి.శాంతికళకు సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించి కర్నూలు డీఎంహెచ్‌వోగా నియమించారు. ఈ మేరకు శనివారం వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కేజీ కృష్ణబాబు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గత 9 నెలలుగా ఇన్‌చార్జి పాలనకు తెరపడినట్లయింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవోగా పని చేస్తున్న డాక్టర్ బి.హేమనళినిని కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సీఎస్‌ఆర్‌ఎంవోగా నియమించారు. బనగేహల్ పీహెచ్‌సీలో పని చేస్తున్న సివిల్ సర్జన్ డా.టీవీ బాలమురళికృష్ణను శ్రీకాకుళం డీఎంహెచ్‌వోగా నియమించారు. కర్నూలు బీ.క్యాంపు సివిల్ డిస్పెన్సరీగా పని చేస్తున్న డా.సీహెచ్ రామకృష్ణను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి సీఎస్‌ఆర్‌ఎంవోగా నియమించారు. 2023-24 సంవత్సరానికి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా ఉన్న 21 మందికి సివిల్ సర్జన్‌గా ప్రభుత్వం పదోన్నతి కల్పించి పోస్టింగ్స్ వేసింది. అందులో భాగంగా జిల్లా నుంచి ముగ్గురు వైద్యులు పదోన్నతులు పొంది కొత్త పోస్టింగ్‌లో బాధ్యతలు చేపట్టనున్నారు.


డాక్టర్ పి.శాంతికళ

ఎంపీపీ, వైద్యులను విచారించిన సీఈవో

చాగలమర్రి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండల ఎంపీపీ వీరభద్రుడు వేధిస్తున్నాడంటూ వైద్యురాలు అంజలి చేసిన ఫిర్యాదు మేరకు జడ్పీ సీఈవో నాసరరెడ్డి శనివారం విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వైద్యురాలు అంజలి విధి నిర్వహణపై ఎంపీపీ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారని, అందువల్ల మానసికక్షోభకు గురై విధులు నిర్వహించలేక పోతున్నానని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని అన్నారు. ఎంపీపీ వీరభద్రుడు, వైద్యురాలు అంజలిని విడివిడిగా విచారణ చేశామని అన్నారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ రవికుమార్ నుంచి కూడా వైద్యురాలి పనితీరుపై నివేదికలు తెప్పించుకొని తుది నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అన్నారు. ఈ విచారణలో ఎంపీపీ మాట్లాడుతూ వైద్యురాలు అంజలిని తాను వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేయడం సమంజసంగా లేదని, హెచ్‌డీఎఫ్‌సీ నిధులను కమిటీ సమావేశం తీర్మానం లేకుండా నిధులు దుర్వినియోగం చేశారని అన్నారు. తాను బాధ్యతగా విధి నిర్వహణ చేశానే తప్ప వేధించలేదని అన్నారు. డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా నోడల్ అధికారి జగదీష్‌చంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


విచారణ చేస్తున్నజడ్పీ సీఈవో

ఈరన్న సన్నిధిలో మంత్రి టీజీ భరత్

కౌతాళం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి వారిని శనివారం పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, అధికారులు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం భరత్ స్వామివారి సన్నిధిలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ అధికారులు ఘనంగా సత్కరించారు. టీజీ భరత్ మాట్లాడుతూ తమ ఇంటి దైవం ఉరుకుంద ఈరన్న స్వామి అని, కుమార్తె వివాహం త్వరలో ఉండటంతో మొక్కులు తీర్చుకునేందుకు వచ్చానని తెలిపారు. మంత్రి వెంట ఆలయ అధికారులు వెంకటేశ్వరరావు, విజయ్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్ప స్వామి, అర్చకులు శివన్న, నాగరాజు, కౌతాళం సీఐ అశోక్ కుమార్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్న బసప్ప, కౌతాళం సాగునీటి సంఘం అధ్యక్షుడు డింగి రఘురాం, నాయకులు భరద్వాజ్ శెట్టి, రామకృష్ణారెడ్డి, కురుగోడు, రమేష్‌గౌడ్, దొడ్డనగౌడ్, సిద్దు, మహదేవ తదితరులు ఉన్నారు.


మంత్రికి స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

భోజనంలో ఈగలు... సాంబార్‌లో బొద్దింకలు..!

కస్టమర్ల నుంచి ఫిర్యాదులు • ఆత్మకూరు గీతా మెస్‌కు రూ.50వేలు జరిమానా విధింపు

ఆత్మకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యత, శుభ్రత పాటించాల్సిన హోటళ్ల నిర్వాహకులు నిబంధనలను ఏమాత్రం లెక్క చేయడం లేదు. తాజాగా ఆత్మకూరు పట్టణంలోని గీతా హోటల్‌లో కస్టమర్లకు ఇచ్చిన ఆహారంలో ఈగలు, సాంబార్‌లో బొద్దింకలు వచ్చిన ఘటన చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ఫిర్యాదులు అందుకున్న అధికారులు విచారణ చేసి రూ.50వేలు జరిమానా విధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు ఖాశీంవలి, వెంకటరాముడు శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కొంతమంది కస్టమర్లు హోటల్‌కు భోజనం చేయగా సాంబార్‌లో బొద్దింక, ఈగలు రావడంతో ఇదేమని నిర్వాహకులను కస్టమర్లు ప్రశ్నించారన్నారు. అయితే నిర్వాహకులు బాధ్యతా రహితంగా వ్యవహరించడంతో పాటు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకో అంటూ దురుసుగా సమాధానం చెప్పారన్నారు. దీంతో కస్టమర్లు తమకు ఫిర్యాదు చేశారన్నారు. తాము హోటల్‌ను, అక్కడి పరిసరాలను పరిశీలించి నివేదికను జేసీ విష్ణు చరణ్ తేజకు సమర్పించామన్నారు. ఆయన నివేదికన పరిశీలించి హోటల్ యజమానికి రూ.50వేలు జరిమానా విధించినట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఖాశీంవలి వెల్లడించారు.



అధికారులు జరిమానా విధించించిన హోటల్ ఇదే..

వరదరాజస్వామి ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

● చైర్మన్, వైస్ చైర్మన్లుగా మల్లికార్జునరెడ్డి, షమీవుల్లా



శ్రీశైలం, నందికొట్కూరు ఎమ్మెల్యేల సమక్షంలో డిక్లరేషన్ పత్రాలు అందుకుంటున్న మల్లికార్జున రెడ్డి, షమీవుల్లా

ఆత్మకూరు/కొత్తపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని వరదరాజస్వామి ప్రాజెక్ట్(శివభాష్యం సాగర్) కమిటీ చైర్మన్‌గా కురుకుంద గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మల్లికార్జునరెడ్డి, వైస్ చైర్మన్‌గా కొత్తపల్లి మండలం నందికుంట గ్రామానికి చెందిన టి.షమీవుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నంద్యాలలోని జలవనరులశాఖ కార్యాలయంలో శనివారం జరిగిన ఎన్నికల్లో వీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరు శ్రీశైలం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్తా జయసూర్య సమక్షంలో డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు.

టీజీపీ కమిటీ ఉపాధ్యక్షుడిగా మనోహర్ చౌదరి



ఎన్నిక పత్రం అందుకుంటున్న కంచర్ల మనోహర్ చౌదరి

బండిఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడిగా కంచర్ల మనోహర్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో గంగ అధికారులు చౌదరికి ఎన్నికపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గంగ కింది కాలువలు అభివృద్ధి చేసి రైతుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండలంలోని పలుగ్రామాల టీడీపీ నాయకులు కంచర్లకు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.

నివాసాల వద్ద సెల్ టవర్ వద్దు

● పనులను అడ్డుకున్న అలగనూరు గ్రామస్థులు



సెల్ టవర్ ఏర్పాటును అడ్డుకుంటున్న ప్రజలు

మిడుతూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అలగనూరులోని ఎస్సీ కాలనీలో నివాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దని శనివారం పనులను గ్రామస్థులు అడ్డుకున్నారు. గతంలో అలగనూరు గ్రామంలో సెల్ టవర్ నిర్మాణం చేపట్టకూడదని కలెక్టర్, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. టవర్ ఏర్పాటును నిలిపివేయాలని వారు ఆదేశించారని చెప్పారు. అయినా టవర్ ఏర్పాటు చేయడం ఏమిటని కంపెనీ యాజమాన్యంపై మండిపడ్డారు. ఇళ్ల మధ్య కాకుండా గ్రామం వెలుపల సెల్ టవర్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నందికొట్కూరు వైసీపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్ అహ్మద్, జూపాడుబంగ్లా జడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైసీపీ నాయకులు నాగిరెడ్డి, తువ్వా మల్లారెడ్డి, శాతనకోట సర్పంచ్ జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



అతిసార నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఆత్మకూరు రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని రుద్ర కోడూరు చెంచు గూడెంలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గిరిజనులకు పలు చిరు వ్యాధులకు చికిత్సలు నిర్వహించి మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, శారదమ్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

'ధ్యానంతో ఒత్తిడి దూరం'

నంద్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో ఒత్తిడి నుంచి విముక్తి కలగడమే కాకుండా సంపూర్ణఆరోగ్యం సిద్ధిస్తుందని నంది సంస్థల ఎండీలు సుజల, అరవిందరాణి అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా నంద్యాల క్రాంతినగర్‌లోని రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీ ఎస్పీవైరెడ్డి సతీమణి పార్వతమ్మ, సుజల, అరవిందరాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో యోగా గురువులు, వివిధ రంగాల ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి

● ప్రజా సంఘాల డిమాండ్



పాణ్యంలో రాస్తారోకో చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నందికొట్కూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): హోంశాఖ మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఆయనను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ, అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. నరసింహులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎం. గోపాల్, ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్వరగౌడ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గోవిందు, కార్యదర్శి శేఖర్, మున్సిపల్ డైలీ వేజ్ యూనియన్ నాయకులు కృష్ణ, సురేష్, పెద్ద రామన్న, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రిపదవి నుంచి తొలగించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం స్థానిక బస్టాండు కూడలిలో నాయకులు రాస్తారోకో చేపట్టారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు అరుణ్‌కుమార్, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు శివకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతను అవమానించడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో వనం రాజు, వెంకటాద్రి, రాజా, ప్రతాప్, సతీష్, నాగరాజు, గిరి, చంద్ర, గోవిందు, అక్బర్, మెహబూబ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో కించపరిచేలా కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం అమానుషమని ప్రముఖ వైద్యుడు డాక్టర్ నాగన్న, ప్రజాసంఘాల నాయకులు మల్లె ఎలీషా, శీలం శేషు, మల్లయ్య, రమేష్‌కుమార్, కేశాలు అన్నారు. శనివారం ఆత్మకూరు పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. తక్షణమే ఆయన్ని పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కేంద్ర మంత్రి అమిత్‌షా తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని దేశప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 23వ తేదిన ఆత్మకూరులో భారీ నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో మాట్లాడుతున్న డాక్టర్ నాగన్న

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి: సీఐటీయూ

ఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, నాయకులు రామ్‌నాయక్, రజాక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులకు నష్టం చేకూర్చే విధంగా నాలుగు లేబర్ చట్టాలను ప్రవేశపెట్టడం సరికాదన్నారు. అలాగే స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు తిరిగి ప్రారంభించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు రణధీర్, సుబ్బయ్య, మంజుల తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మిడుతూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, బైరాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో దశరథరామయ్య, ఈవోఆర్డీ సంజన్న పరిశీలించారు. వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. పిల్లల హాజరు శాతాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న శంకరమ్మ

నంద్యాల రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలంలోని అయ్యలూరు గ్రామంలోని బుడగ జంగాలకు చెందిన నల్లపూసల నాగమ్మ శనివారం మృతి చెందారు. టీడీపీ నాయకురాలు శంకరమ్మ బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు నగదును అందించారు. ఆమె మాట్లాడుతూ పేదలకు అండగా ఉంటానని అన్నారు. అందరూ పేదలకు సహకారమందించాలని కోరారు.

బెల్లం ఊట ధ్వంసం

గడివేముల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైకే తండా గ్రామ శివార్లలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు సీఐ కృష్ణమూర్తి తెలిపారు. ఈ దాడుల్లో నాటుసార తయారికి సిద్ధంగా ఉన్న 1,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకు గాను నాటుసార తయారీదారులు గుట్టుచప్పుడు కాకుండా సార తయారు చేస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి నట్లు ఆయన తెలిపారు. నాటుసార అమ్మినా, తయారు చేసిన, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లోఎక్సైజ్ ఎస్‌ఐలు బ్రహ్మయ్య, శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని కాకులగడ్డ ఏరియాలో శనివారం ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరిగడ్డికి విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. వివరాలివీ.. కాకులగడ్డ ఏరియాకు చెందిన తిప్పారెడ్డి అనే రైతులు తన పాడిపశువుల కోసం ఆత్మకూరు మండలంలోని కురుకుంద గ్రామంలోని వరిగడ్డిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. ఈక్రమంలో కాకులగడ్డ ఏరియా సమీపంలో ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరిగడ్డికి విద్యుత్ తీగలు తగిన మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్ సుధాకర్ వరిగడ్డిని ట్రాక్టర్ నుంచి తొలగించే ప్రయత్నం చేశారు. అయినప్పటికి వరిగడ్డితో పాటు ట్రాక్టర్ ట్రాలీ, ఇంజన్ కూడా కాలిపోయి దెబ్బతిన్నాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.2.60 లక్షలు నష్టం వాటిల్లినట్లు డ్రైవర్ సుధాకర్ చెప్పారు.

'రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి'

నందికొట్కూరు, రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శాతనకోట గ్రామంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రైతులతో మాట్లాడుతూ గ్రామంలో వ్యవసాయ భూముల విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే వాటి ఆధారాల నకళ్లతో ఒక అర్జీ రూపంలో రెవెన్యూ అధికారులకు అందజేయాలని సూచించారు. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు తమవంతు కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉమారాణి సచించారు. మండలంలోని గువ్వలకుంట్ల గ్రామసచివాలయ ఆవరణలో శనివారం స్థానిక సర్పంచ్ మశమ్మ అధ్యక్షతన తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, వీరాపురం సర్పంచ్ సరస్వతమ్మ, మండల సర్వేయర్ అనూషారాణి, వీఆర్వోలు వేణుగోపాల్‌గౌడు, చంద్రశేఖర్, టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, జానకి రాముడు, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం

శ్రీశైలం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి శనివారం కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన కె.వెంకటపూర్ణనారాయణరావు రూ.1,00,116 విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి.స్వాములుకు అందజేశారు. హైదరాబాదుకు చెందిన తోటిరెడ్డి నిఖిత కుటుంబ సమేతంగా కలిసి రూ. 1,00,116 విరాళాన్ని పర్యవేక్షకుడు ఎం.మల్లికార్జునకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ధర్మపథంలో భాగంగా శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో శనివారం సాయంత్రం విశాఖ పట్టణానికి చెందిన శివ క్లాసికల్ డాన్సు అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయక ప్రార్థన, శివపంచాక్షరి, శివోహం, అయిగిరినందిని తదితర గీతాలకు కృష్ణవేణి, అంకిత, భవిష్యవాణి, మహీధర్, అరుణ్, సంజన తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

రాష్ట్ర స్థాయి లఘు చిత్ర ప్రదర్శన పోటీల్లో ప్రతిభ

నంద్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి లఘు చిత్ర ప్రదర్శన పోటీల్లో నంద్యాల గురురాజ పాఠశాల విద్యార్థి ఫర్హాన్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ ఇంధన శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి లఘుచిత్ర ప్రదర్శన పోటీల్లో ప్రాతినిధ్యం వహించినట్లు చెప్పారు. బాల్యదశలోనే ఇంధన పొదుపు పట్ల ప్రజలకు అవగాహనకల్పించిన లఘు చిత్రానికి ప్రతిభా పురస్కారం లభించిందన్నారు. రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్ చేతులమీదుగా మెమెంటో, ప్రతిభా, ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డా.దస్తగిరిరెడ్డి, డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి అభినందించారు.

రోగులతో మర్యాదగా మెలగాలి: డీఎంహెచ్‌వో



గాజులపల్లి పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

మహానంది, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రోగులకు మర్యాదగా మెలుగుతూ సత్వర వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శనివారం గాజులపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, రోగులకు చికిత్స అందించే గదులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సాధ్యమైనంత సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. మాత శిశు సంర క్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రూపేంద్ర నాథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత దినోత్సవాన్ని నంద్యాల బాల అకాడమీలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన గణితానికి సంబంధించిన ప్రాజెక్టులతో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. కరస్పాండెంట్ రవీంద్రనాథ్, పిన్సిపాల్ మాధవీలత పాల్గొన్నారు.

● నంద్యాల భారతి బీఈడీ కళాశాలలో శనివారం శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిడుతూరు(ఆంధ్రజ్యోతి): మిడుతూరులోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ హైస్కూల్‌లో శనివారం ఎంఈవో శ్రీనాథ్ ఆధ్వర్యంలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన గణితం స్టాళ్లను ఆయన పరిశీలించారు. ప్రిన్సిపాల్ శివకిరణ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): గణితంతోనే మనిషి మేధస్సు పెరుగుతుందని చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ తాజుద్దీన్ అన్నారు. శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శనివారం పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన గణిత ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కేన్సర్ వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ శారదాబాయి

బండిఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరులో కేన్సర్ వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వేను శనివారం అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ శారదాబాయి పరిశీలించారు. డాక్టర్ భావన, డాక్టర్ సరిత ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహిస్తున్న కేన్సర్ వ్యాధి నిర్ధారణ సర్వేను పరిశీలించి మాట్లాడారు. వ్యాధిగ్రస్థులకు మందులు క్రమం తప్పకుండా అందించాలని సూచించారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

పాములపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపెంట మజరా గ్రామం లోని గుండాలనట్టు గ్రామంలో టీడీపీ కార్యకర్త శివనాయక్ (56) గుండెపోటుతో మృతి చెందారు. వేంపెంట గ్రామం టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి, లెనిన్ బాబు, బాలస్వామి, లు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులు సోమని నాయక్, అబ్రహాం, రామునాయక్, చిన్నస్వాములు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

నందికొట్కూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా నందికొట్కూరు పట్టణంలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు దుస్తులను పంపిణీ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతలో ప్రధాన భూమిక పోషిస్తున్నది పారిశుధ్య కార్మికులేనని అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం నందికొట్కూరు కౌన్సిల్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబి, కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, మండడి వాణి, చాంద్‌బాషా, అబ్దుల్ రావూఫ్, మున్సిపల్ ఏఈ దినేష్, సీనియర్ అసిస్టెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి'



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

నంద్యాల రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నూతనంగా అమలులోకి వచ్చిన కాంట్రిబ్యూషన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల ఈశ్వరరెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని సీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పట్టణ పరిధిలోని వివిధ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామంలో సంకల్ప వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పుల్లయ్య నాయక్, ప్రధాన కార్యదర్శి రవితేజ, చెన్నయ్య, మహేంద్రరెడ్డి, శ్యామరాజు, నిర్మల, శిరీష, విజయకుమారి పాల్గొన్నారు.

సోనా మసూరి రకం అభివృద్ధికి చర్యలు

● నూతన పద్ధతులతో అధిక దిగుబడి సాధ్యం

● జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

నందికొట్కూరురూరల్ డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సోనామసూరి రకాన్ని అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. నందికొట్కూరు మండలంలోని శాతనకోట గ్రామంలో శనివారం రైతు స్వామి మురళి వరిపొలంలో జిల్లా వ్యవసాయాధికారితో పాటు నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్ వరి పంటలో (సోనామసూరి) బీపీటీ 5204 రకం పంటను కోత దశలో పరిశీలించి 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో కోత కోయించి పంట దిగుబడిని అంచనా వేశారు. వారు మాట్లాడుతూ రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరించడం వల్ల శాతనకోట గ్రామంలో ఎకరాకు 35.24 క్వింటాళ్ళు దిగుబడి వచ్చిందని తెలిపారు. వరిలో సన్నరకాలైన (సోనామసూరి) బీపీటీ 5024 రకం ఎక్కువగా కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రాంతంలో పండిస్తారని తెలిపారు. ఈ రకం వరిధాన్యం రాయల సీమ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ఈ సోనామసూరి రకం దేశంలోనే ఎంతో పేరుప్రఖ్యాతులు గాంచిందని అన్నారు. ఈ సన్నరకం వరిధాన్యాన్ని ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తారని అన్నారు. నూతన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి వస్తుందని, ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏవో షేక్షావలి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



శాతనకోటలో పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పగిడ్యాల(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగుల మందులను ఎమార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ హెచ్చరించారు. పగిడ్యాలలోని మల్లికార్జున ఎరువుల దుకాణాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. అనతరం వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో పంట నమోదు, ఫసల్ బీమాపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన వెంట నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, వ్యవసాయాధికారి జ్యోత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఎస్సార్బీసీ ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడిగా జిల్లెళ్ల రాజశేఖర్‌రెడ్డి

బనగానపల్లె, డిసెం బరు 21 (ఆం ధ్రజ్యోతి): ఎస్సార్బీసీ ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడిగా జిల్లెళ్ల రాజశే ఖర్‌రెడ్డి శనివారం ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. ఎ స్సార్బీసీ డిస్ట్రిబ్యూటరీ క మిటీ అధ్యక్షులు ఏకగ్రీ వంగా రాజశేఖర్ రెడ్డిని ఎ న్నుకున్నారు. ఎన్నికల అ ధికారి నుంచి చైర్మన్‌గా రాజశేఖర్‌రెడ్డి డిక్లరేషన్ పారం అందుకున్నారు. తనను ఎస్సార్బీసీ ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకోవడానికి సహకరించిన మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యా ల ఎంపీ బైరెడ్డి శబరికి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సార్బీసీ కాల్వల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



చాగలమర్రి ఎస్సీ కాలనీలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న ఫాదర్, విద్యార్థులు

చాగలమర్రి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఎస్సీ కాలనీల్లో ఆర్సీఎం చర్చి ఫాదర్ ప్రకాష్ ఆధ్వర్యంలో శని వారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు క్యాండిల్స్ చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. యువతీ యువకులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. క్రిస్మస్‌తాత వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంఘ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి: సీఐ

బనగానపల్లె, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రవ్వలకొండ ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ రామలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ దుగ్గిరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీలను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించం

ప్యాపిలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించమని డీపీవో జెమిఉల్లా హెచ్చరించారు. మండలంలోని పీర్‌పల్లి గ్రామానికి చెందిన రైతు రంగారెడ్డి తన పొలంలోకి మురుగు నీరు వస్తుండటం వలన పంటలు దెబ్బతింటున్నాయని అమరావతి పీజీఆర్ఎస్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన డీపీవో శనివారం మండలంలోని పీర్‌పల్లి గ్రామంలో రైతు పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో గ్రామస్థులతో మాట్లాడుతూ మురుగు నీటిని రోడ్లు, పొలాల్లోకి వదల కూడదన్నారు. గ్రామాల్లో పర్యటించి పంచాయతీ పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఆయన స్థానిక అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూ ఎస్సీ మనోహర్, ఆర్డీవో నరసింహులు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత

బనగానపల్లె, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే యోగా చేస్తే ఏకాగ్రత పెరుగుతుందని బనగానపల్లె ప్రభుత్వ ఉన్నతపాఠశాల హెచ్ఎం రామకృష్ణయ్య తెలిపారు. శనివారం యోగా గురువు తిరుమలయ్య ఆధ్వర్యంలో యోగాపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో యోగా మాస్టర్లు శివప్రసాద్, మహాలక్ష్మి సభ్యులు శాంతి, రూపాదేవి, మాధవి పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు

శిరివెళ్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల సమీపంలో శనివారం కారు బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి కడపకు వెళ్తున్న కారు కళాశాల సమీపంలో అడ్డుగా వచ్చిన శునకాన్ని తప్పించబోయి అదుపు తప్పింది. దీంతో కారు పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో దినేష్, యశ్వంత్ అనే యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై శిరివెళ్ల పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

బాలిక చదువు దేశానికి వెలుగు

రుద్రవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాలికల చదువు దేశానికి వెలుగునిస్తుందని ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్ అన్నారు. శనివారం రుద్రవరం ఆదర్శపాఠశాల విద్యార్థు లు, ఉపాధ్యాయులు బేటి బచావ్, బేటి పడావ్ అంశంపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వే చేయడంలో నిర్లక్ష్యం చేయొద్దు

రుద్రవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మిస్సింగ్ సిటిజన్ సర్వే చేయడంలో నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామంలో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీల్లో సర్వే కొనసాగుతుందన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

చాగలమర్రి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పాత ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు ప్రకాశం శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నంద్యాల పార్లమెంట్ స్పోక్‌పర్సన్ నల్లానాగరాజు, టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తినరసింహులు, బీసీ సంఘ నాయకులు సంతాపం ప్రక టించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోట న్నారు. వారి వెంట బీసీ సంఘ నాయకులు మహబూబ్‌బాష, చోటు, బాలదస్తగిరి, నాగేంద్ర, పీరయ్య, లాల్‌బాష తదితరులు పాల్గొన్నారు.

టీజీపీ ప్రధాన కాల్వకు నీరు విడుదల

రుద్రవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి టీజీపీ ప్రధాన కాల్వకు వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు శనివారం టీజీపీ అధికారులు తెలిపారు. తెలుగుగంగ ప్రధాన కాల్వకు నీరు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. వారబంది ప్రకారం గంగ కాల్వకు నీరు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

మంత్రి బీసీ రూ. లక్ష విరాళం

బనగానపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హజ రత్ మీర్ హాశంవలి , దేహలివాలే సా హెబ్ దర్గా ఉర్సుకు మంత్రి బీసీ జనార్ద న్ రెడ్డి రూ.లక్ష విరాళం అందించినట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. 22న గంధం, 23న ఉర్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. విరాళం అందించిన మంత్రికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.3.03 లక్షలు

బేతంచెర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.3.33 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. కార్యక్రమంలో పూజలు, భక్తులున్నారు.

అభివృద్ధికి 'బాటలు'

- గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.23.40 కోట్లు మంజూరు
- కూటమి ప్రభుత్వంలో ముమ్మరంగా పనులు



బనగానపల్లె మండలం సాధుకొట్టంలో పూర్తి అయిన సీసీ రోడ్డు

బనగానపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు పూర్తవుతుండడంతో కొత్తశోభను సంతరించుకుంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో సరైన మురుగు కాల్వలు, సీసీ రోడ్లులేక ప్రజలు అవస్థ పడ్డారు. రోడ్లపైనే మురుగునీరు పారేది. వీధుల్లో తిరిగేందుకు ఇబ్బందులు పడేవారు. కూ టమి ప్రభుత్వంలో బనగానపల్లె నియోజకవర్గం లో సీసీ రోడ్లకు రూ. 23.40 కోట్లు పనులకు పంచాయతీ ల్లో తీర్మానాలు చేయించి పం చాయతీరాజ్ నిధులతో ము మ్మరంగా అభివృద్ధి పనులు ప్రారంభించారు.

వైసీపీ హయాంలో గాలికొదిలేసిన అభివృద్ధి

అభివృద్ధికి పెద్దపీట వేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేసింది. దీంతో గ్రామాల్లో సీసీ రోడ్లు లేక, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్య స్తంగా మారిపోయింది. డ్రైనేజీ సౌకర్యాలు లేక రోడ్ల మీదనే ము రుగునీరు పారేది. వీధుల్లో నడవాలంటే ఇబ్బంది పడ్డాల్సి వచ్చేది.

కూటమి ప్రభుత్వం రాకతో గ్రామాల్లో సీసీ రోడ్లకు మోక్షం

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధి కారంలోకి రావడంతో గ్రామాలకు మోక్షం లభించింది. అధ్వానంగా ఉన్న సీసీ రోడ్లపై దృష్టి పెట్టింది. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు రూ.23.40 కోట్ల పంచాయతీరాజ్ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు పనులు ప్రారంభించింది. సంక్రాంతి పండుగ నాటికి పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రతి నిధులు, అధికారులు ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 80శాతం పనులు పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వంలో కొనసాగు తుండడంతో గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం

బనగానపల్లె నియోజకవర్గంలో నాణ్యత విషయంలో రాజీ పడకుండా ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయి. ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. దాంతో శాయశక్తులా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

- నాగశ్రీనివాసులు, డీఈ, పంచాయతీరాజ్



సంజామల మండలం నట్టకొత్తూరులో వేసిన సీసీ రోడ్డు

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ
- గ్రామీణ స్థాయిలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు హర్షణీయం

శిరివెళ్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం శిరివెళ్ల మండలంలోని రాజనగరం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ మైదానంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా), నిరంజన్ శృంగవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. హైదరాబాద్ బసవతారకం కేన్సర్ హాస్పిటల్, కర్నూలు మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవం కలిగిన 25 మంది వైద్య బృందంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ మాట్లాడుతూ కేన్సర్ మహమ్మారిని తొలి దశలోనే గుర్తిస్తే సకాలంలో వైద్య సేవలు పొందవచ్చని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో విద్య, వైద్య సేవలతో పాటు పలు సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్‌ను నిర్వాహకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శృంగవరపు సుబ్రమణ్యం, శృంగవరపు విజయ్ కుమార్, మాలపాటి పుల్లయ్య చౌదరి, కుందూరు మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జవహర్‌రెడ్డి, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్, మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం ఆదిత్య, మహేశ్వరరెడ్డి, ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

అమిత్‌షా రాజీనామా చేయాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆళ్లగడ్డలోని నాలుగు రోడ్ల కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిలపక్ష నాయకులు నిరసన వ్యక్తం చేశారు. చట్టసభలలో చట్టాలను ఏర్పాటు చేయడానికి అవసరమైన రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి అమి త్‌షా చేసిన వ్యాఖ్యలు సరికావని ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఏసీ కన్వీనర్ బీరువాల బాషా, కాంగ్రెస్ పార్టీ సమన్వ యకర్త బరగొడ్ల హుసేన్ బాషా, రాష్ట్ర మైనార్టీ సెక్రటరీ శంషుల్‌హక్, మాల మహానాడు నాయకులు సుధాకర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : భారత రాజ్యాంగ నిర్మాత, గొప్ప దార్శనికుడు డా.బీఆర్ అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని సీపీఎం నాయకులు దావీదు అన్నారు. శనివారం కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ప్రధాన రహదారిలో వివిధ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని, భారత రాజ్యాంగాన్ని రక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, ఇస్మాయిల్, మాలమహానాడు బుగ్గరాముడు, నడిపిన్న, మద్దిలేటి పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఘనంగా మాజీ సీఎం జగన్ జన్మదినం



కేక్‌కట్ చేస్తున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల, గుర్విరెడ్డి తదితరులు

కొలిమిగుండ్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు స్థానిక వైసీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైసీపీ మండల కన్వీనర్ అంబటి గుర్విరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో ఉమ్మడి కర్నూల్ జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉదయ్ భాస్కరరెడ్డి, మాజీ ఎంపీపీ రామాంజనేయులు, సత్యాల్‌రెడ్డి, మొలక రాజారెడ్డి, మహేశ్వరరెడ్డి, పేరం రామశంకరరెడ్డి తదితరులు హాజరై కేకు కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి, సర్పంచులు ఈశ్వరయ్య, రామాంజనేయులు, గుర్విరెడ్డి, శివ, నందిపాడు విష్ణు, గొర్విమానుపల్లె జగన్, ఎంకె నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని రూపనగుడి గ్రామంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకను సర్పంచ్ దేశం సోమశేఖరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు కార్యకర్తలు గానసంచాపేర్చి సందడి చేశారు.

ప్యాపిలి: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజారెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి ఎర్రగుంట్లపల్లిలో నిర్వహించిన జగన్ జన్మదినం వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, శ్రీరామిరెడ్డి, రాజా మురళి, బోరా మల్లికార్జునరెడ్డి, రజనికాంత్‌రెడ్డి, రాము, క్రిష్ణమూర్తి, కొండయ్య పాల్గొన్నారు.

బేతంచెర్ల: మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ చలంరెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, ముర్తుజావలి, ఖాజా, బీరువలి నాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

చాగలమర్రి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని భారతీ విద్యామందిరంలో శనివారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జయంతి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన గణిత నమూనాలను ఎంఈవో న్యామతుల్ల, సీఆర్పీ అమీర్‌ఖాన్ పరిశీలించారు. అనంతరం శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి సుబ్బారావు, సుంకు రాజేష్, హెచ్ఎం ప్రసాద్, కాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ సేవలు చిరస్మరణీయమని ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు అమీర్ బాషా అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్‌కే పాఠశా లలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి శనివారం నివాళి అర్పించారు. గణిత ఉపాధ్యాయులు లక్ష్మీరెడ్డి, రెహానాలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని బేతంచెర్ల, గోర్లగుట్ట గ్రామంలో పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అలాగే ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు మెగా వైద్యశిబిరం

చాగలమర్రి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప ఆలయ అధ్యక్షుడు జనార్దన్ తెలిపారు. ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్య నిపుణులచే వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈసీజీ, ఈసీవో, పలు రకాల వ్యాధులకు చికిత్సలు, మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

కోవెలకుంట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో వర ప్రసాదరావు, ఈవోపీఆర్డీ ప్రకాశ్‌నాయుడు అన్నారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని స్వామినగర్, ఇందిరమ్మకాలనీలో ఉదయం 8గంటలకు స్వచ్ఛ కోవెలకుంట్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళలు, అధికారులు పాల్గొని రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు మల్లికార్జునరెడ్డి, పెనుగొండ రాజశేఖర్, కుళాయి బాషా, మురళి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

కోవెలకుంట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జున అన్నారు. శనివారం పట్టణంలోని జమ్మలమడుగు సర్కిల్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. సర్టిఫికెట్లు, లైసెన్సులు లేని వాహనాలకు జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వేగాన్ని తగ్గించడం వల్ల ప్రమాదాల బారి నుంచి బయటపడి సురక్షితంగా గమ్యస్థానాలు చేరవచ్చన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

చాగలమర్రి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలో బంగాళాఖాతంలో అల్పపీడనం వల్లన కురిసిన అకాల వర్షంతో నష్టపోయామని ఆదుకోవాలంటూ రైతులు వేడుకుంటున్నారు. శనివారం శెట్టివీడు, ముత్యాలపాడు, మద్దూరు, చాగలమర్రి తదితర గ్రామాల్లో కలాలు, రహదారుల్లో తడిచిన వరి ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. తడిచిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. అసలే ధర లేక అవస్థలు పడుతున్నామని, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సీసీ రోడ్లతో గ్రామాలకు మహర్దశ

అవుకు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలతో గ్రామాలకు మహర్దశ వచ్చిందని టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి అన్నారు. శనివారం చెర్లోపల్లె గ్రామంలో సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేసి నిర్మాణం పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో రూ. 3.50 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. చెర్లోపల్లెలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం పనులను పరిశీ లించినట్లు తెలిపారు.



సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఉగ్రసేనారెడ్డి

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

దొర్నిపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ సుభద్ర అన్నారు. శనివారం చాకరాజువేములలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ మాదవ్, ఎండోమెంట్ అధికారి వీరయ్య, సర్వేయర్ నాగప్రసాద్, నాయకులు లింగుట్ల వెంకట్‌నాయుడు, గంగ వరం కృష్ణారెడ్డి, లింగుట్ల రమణయ్య, ఎండూరి గోపాల్‌నాయుడు, కాకర్ల కేశవనాయుడు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఎర్రచందనం వృక్ష సంపద సంరక్షణకు చర్యలు

- శ్రీనివాసరెడ్డి, ఫారెస్టు సబ్ డివిజన్ అధికారి



రుద్రవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఫారెస్టు రేంజ్‌లో ఎర్రచందనం వృక్ష సంపద ఉందని ఫారెస్టు సబ్ డివిజనల్ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎర్రచందనం వృక్షసంపద సంరక్షణకు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: రుద్రవరం సబ్ డివిజనులో ఎన్ని బేస్‌క్యాంపులు ఉన్నాయి?

జవాబు: రుద్రవరం సబ్ డివిజనులో రుద్రవరం, చెలిమ ఫారెస్టు రేంజ్‌లు విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలో రుద్రవరం రేంజ్‌లో నాలుగు బేస్‌క్యాంపులు, చెలిమ రేంజ్‌లో రెండు బేస్ క్యాంపులు ఉన్నాయి. ఒక్కో బేస్‌క్యాంపులో ఐదుగురు ప్రొటెక్షన్ వాచర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రశ్న: సబ్ డివిజనులో సిబ్బంది కొరత ఉందా?

జవాబు: సబ్ డివిజనులో సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే. బీట్ ఆఫీసర్లు, అసిస్టెంటు బీట్ ఆఫీసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్రశ్న: ఎర్రచందనం వృక్ష సంపద సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: ఎర్రచందనం వృక్ష సంపదకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బందిని అప్రమత్తం చేస్తుంటాం. ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నాం.

ప్రశ్న: రెండు రేంజ్‌లు ఎన్ఎస్‌పీఆర్‌లో చేరాయి కదా?

జవాబు: రుద్రవరం, చెలిమ రేంజ్‌లు ఎన్ఎస్‌పీఆర్‌లో ఉన్నతాధికారులు చేర్చారు. వన్యప్రాణుల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: వన్యప్రాణుల వేట ఇంకా కొనసాగుతుందా?

జవాబు: వన్యప్రాణుల వేటపై ప్రత్యేక నిఘా పెట్టాం. 1972 వన్యప్రాణి చట్టం కింద వన్యప్రాణులు వేటాడితే శిక్షార్హులవుతారు.

ప్రశ్న: అక్రమ రవాణాపై ఎలాంటి చర్యలు

జవాబు: సబ్ డివిజను పరిధిలో అక్రమ రవాణా సాగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉన్నారు. అక్రమంగా వెదురు రవాణా చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని డిపోలకు తరలిస్తున్నాం.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

డోన్ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలకు పట్టణ ప్రజలు సహకరించాలని డీఎస్పీ పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోపుల డోన్ పట్టణం నడిబొడ్డు మీదుగా వెళ్లిన ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద మోటారు బైక్‌ల పార్కింగ్ స్థలాలకు పనులు మొదలు పెట్టి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పట్టణవాసులు, పోలీసులకు సహకరించాలని కోరారు. డోన్ పట్టణ సమీపంలో జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ వలంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడికి సత్కారం

డోన్ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఇటీవల నియమింపబడిన వైసీపీ వాలంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్‌ను వైసీపీ నాయకులు పూలమాలలు, శాలువలతో సత్కరించారు. అంతకుముందు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సప్తశైల రాజేష్, నాయకులు శ్రీరాములు, జాకీర్ హుశేన్, సోమేష్ యాదవ్, మల్లెంపల్లి రామచంద్రుడు పాల్గొన్నారు.

27న జాబ్‌మేళా

డోన్ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలోని ఎస్ఏసీ సెంటరులో ఈ నెల 27న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి శనివారం తెలిపారు. మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. జాబ్‌మేళాను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు నైపుణ్యాభివృద్ధి సంస్థను సంప్రదించాలని కోరారు.

విద్యాసామగ్రి అందజేత

బనగానపల్లె, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామంలోని జడ్పీ ఉన్నతపాఠశాల పదోతరగతి విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు అవసరమైన సామగ్రిని నంద్యాలకు చెందిన రిటైర్డు సీఐ మహమ్మద్ మస్తాన్ వలి శనివారం పంపిణీ చేశారు. బయలాజికల్‌సైన్సు టీచర్ శివరామిరెడ్డి అభ్యర్థన మేరకు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో గుండం భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పక్కీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు గుండం భాస్కర్‌రెడ్డి రూ.30వేలు విలువ చేసే కంప్యూటర్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు.

సారా స్థావరాలపై దాడులు

కొలిమిగుండ్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లోని పలు ప్రాంతాల్లో నాటుసారా స్థావరాలపై విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి తెలిపారు. పలు ప్రాంతాల్లో నాటుసారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 400లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఆమె తెలిపారు. మరోవైపు కొలిమిగుండ్ల మండలం కొలిమిగుండ్ల, అవుకు చెందిన నాటుసారా విక్రేతలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు కమలాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా సీఎం సహాయ నిధి

కొలిమిగుండ్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న బాధితులకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలుస్తోందని తెలుగు యువత మండల అధ్యక్షులు పేట్నీకోట హుస్సేన్‌రెడ్డి అన్నారు. పేట్నీకోట గ్రామానికి చెందిన కొప్పుల లక్ష్మీదేవి అనే మహిళ అనారోగ్యానికి గురి కావడంతో హుస్సేన్ రెడ్డి విజ్ఞప్తి మేరకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాలతో సీఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును శనివారం అందజేశారు. దీంతో ముఖ్యమంత్రికి, మంత్రి బీసీకి బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు.

రామ్‌కో ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం

కొలిమిగుండ్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వటాల గ్రామంలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. పరిశ్రమ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు, అడ్మిన్ హెడ్ రామరాజు, జీఎం రవికుమార్ తదితరులు పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి, పశు పోషకులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ మోహన్‌రావు, డాక్టర్ రమేష్‌బాబు, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

క్యాలెండరు ఆవిష్కరణ

కోవెలకుంట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బలిజ సంఘం కార్యాలయంలో శ్రీకృష్ణ దేవరాయ బలిజ సంఘం క్యాలెండరును ఆ సంఘం నాయకులు శనివారం ఆవిష్కరించారు.కార్యక్రమంలో విజయకుమార్, శంకరుడు, పరంధామయ్య, రమణయ్య, శ్రీనివాసులు, నాగరాజు, వెంకటేశ్వర్లు, రామ్మోహన్ పాల్గొన్నారు.